బొజ్జయ్యరు రోజూ సాయంకాలం ఆనందభవనం వీధి అరుగుమీద కూర్చుంటాడు. కొడుకులు వ్యాపారం చూసుకుంటున్నారు. ఇటూ అటూ పోయే యువకులను పిలుస్తూ వుంటాడు. కబుర్లు చెబుతూ వుంటాడు.

'అయ్యరుగారూ! మీ బొజ్జ ఎలా పెరిగింది?' అని కొందరు యువకులు నవ్వుతూ అడుగుతూ వుంటారు. రెండు చేతుల్తో బొజ్జను రాసుకుంటూ, చిరునవ్వు నవ్వుతూ నాటకీయంగా చేతులు తిప్పుతూ చెబుతూ వుంటాడు.

'మన చదువులు నిజజీవితంలో పనికిరావు. ఉద్యోగం కోసం బతుకు తెరువు కోసం చదువుతున్నాం. వ్యాపారంలో ఎదగాలీ అంటే, ఎక్కడ పేదరికం ఎక్కువగా వుందో, అక్కడే పెట్టుబడి పెట్టాలి. అప్పుడే గొప్ప లాభాలు వస్తాయి. అధికార్లనీ, రాజకీయ నాయకుల్నీ చేతుల్లో పెట్టుకోవాలి. వాళ్ల జేబులు నింపాలి. వాళ్ల బొజ్జలు నింపాలి. వాళ్ల బలహీనతల్ని డబ్బుగా మార్చుకోవాలి. ఎవళ్లనో మనం దోపిడీ చేస్తున్నామని ఎంతమాత్రం అనుకోకూడదు. ఎవరి బొజ్జయినా అలాగే పెరుగుతుంది. నా బొజ్జ కూడా అలాగే పెరిగింది!' అలా అలా ఏవేవో అయ్యరు చెబుతూ వుంటాడు.

★ ★ ★

నాయరు పదిహేనేళ్ళ వయసులోనే పోలీసుల చేతుల్లో పడిపోయాడు. జేబులు కత్తిరిస్తుండగా పట్టుబడ్డాడట.

'ఒరేయ్! ఈడు డేంజరు గోడు! ఈడి సూపులు పదును పట్టిన కత్తుల్లాగున్నాయి! ఈణ్ని ఒగ్గేస్తే డేంజరైపోద్ది! ఈడు మనకి పనికొస్తాడు! ఒగ్గేకండి! కత్తుల్లాంటి సూపుల్తో కత్తి నాగున్నాడు!' అని పోలీసు హెడ్డు మురిసిపోయి చెప్పేడు. నాయరు ఠాణాలో వుంటున్నాడు. నాయరు ఠాణాలో పోలీసులకు పలు సేవలు చేస్తున్నాడు. హెడ్డుకి పగలు వొళ్ళూ, రాత్రి కాళ్ళూ పడుతున్నాడు.

అలా కొంతకాలం గడిచేక, నాయరు జీవితంలో మార్పు వచ్చేసింది. అతడి పొజిషను పెరిగింది. పొజిషను పెరిగేక, నాయరు ఠాణాకి రావాల్సిన చిన్న చిన్న మామ్మూళ్లు వసూలు చేస్తున్నాడు. వచ్చే పోయే లారీల వాళ్ల నుంచీ, పేవ్‌మెంటు మీది చిల్లర దుకాణాల నుంచి, లైసెన్సులు లేని వాహనాల వాళ్లనుంచి, అలా ఎన్నో రోజువారీ మామ్మూళ్లు వసూలు చేస్తున్నాడు. ఆ వసూళ్లు నాయరు మొదలుపెట్టాక, ఠాణా ఆదాయం బాగా పెరిగిపోతోంది. హెడ్డు మురిసిపోయాడు.

నాయరు చూపుల్నీ, నాయర్నీ ప్రశంసించాడు. పొజిషను పెద్దది చేశాడు. రోజువారీ మామ్మూళ్లే కాకుండా, నెలవారీ మామ్మూళ్లు వసూలు చేస్తున్నాడు. మద్యం షాపుల నుంచి, వ్యభిచార గృహాల నుంచి, జూద గృహాల నుంచి, దొంగ సామాన్లు అమ్మే షాపుల నుంచి, సెక్స్ సాహిత్యాలు, యువతుల నగ్న ఫోటోలూ... బ్లూ ఫిల్ములూ అమ్మే షాపుల నుంచి, నీలి బొమ్మలు చూపించే గృహాల నుంచి నెలవారీ మామ్మూళ్లు వసూలు చేస్తున్నాడు. వసూలు చేసిన డబ్బంతా నిజాయితీగా, ఠాణాకి అందజేస్తున్నాడు. ఠాణా ఆదాయం ఎంతో, ఎంతగానో పెరిగిపోతోంది.

అలా కొంతకాలం గడిచిపోయింది. కొన్నేళ్లు గడిచిపోయాయి. ఓ రోజు హెడ్డు పోలీసుల్ని అందర్నీ పిలిచి చెప్పాడు.

'నాయరు గోడు డేంజరు గోళ్లలో పరమ డేంజరు గోడు! ఈడికి పవరుంటే పొట్టపొగులే పెజల్ని నవిలి మింగేస్తాడు! ఈడు నమ్మా మనందర్నీ ముంచేస్తాడని డౌటుగా వుంది! ఈణ్ణి మరింక ఒగ్గేయండి! దేశం మీదికి ఒగ్గేస్తే గొప్ప డేంజరైపోద్ది! ఊరొగ్గేసి ఎల్లకుండా సూడండి! కన్నేసి వుంచండి!' అని హెడ్డు చెప్పేడు. నాయరు బయటపడ్డాడు.

ఆనాడే నాయరు ఉంగరాల జుత్తు గొరిగించేసాడు. కొడవలిలా మెలికలు తిరిగిన మీసాలు తీయించేశాడు. తెల్ల లుంగీ పంచె, తెల్ల చొక్కా వేసుకున్నాడు. వీభూతి పెట్టుకున్నాడు. రెండు చేతులూ జోడించి బొజ్జయ్యరు ముందు నిలబడ్డాడు. పని కావాలని తమిళంలో అడిగేడు. అయ్యరుకి తన బాల్యం గుర్తుకొచ్చింది. వెంటనే నాయరుకి పని ఇచ్చేడు. అయ్యరు అతడి పని చూసి మురిసిపోతూ వుండేవాడు.

కాఫీ హొటల్ని ఆనుకుని కిల్లీ బడ్డీ పెడితే తన వ్యాపారం పెరుగుతుందని అయ్యరు ఎప్పట్నుంచో అనుకుంటున్నాడు. బడ్డీ కట్టించి నాయర్ని అందులో కూర్చోబెట్టాడు. ఆ విధంగా నాయరు సొంత వ్యాపారం ప్రారంభించేడు. వ్యాపారం బాగా నడుస్తోంది. పోలీసుల మధ్య తిరిగి తిరిగి సంపాదించిన అనుభవంతో వ్యసనాలన్నీ అమ్ముతూ సుళువుగా బాగా డబ్బు సంపాదిస్తున్నాడు. నాయరు చిన్న ఇల్లు కూడా కొన్నాడు. బాగా స్థిరపడ్డాడు. పెళ్ళి కూడా చేసుకున్నాడు. ఆ సందర్భంగా మేకల పైడితల్లి నాయరుకి ఎంతో సాయం చేసింది.

కిల్లీ బడ్డీ నానుకుని పైడితల్లి చేత నాయరు పళ్ల దుకాణం పెట్టించేడు.

ఆమెకు సాయం చేసినట్లు వుండడమే గాకుండా, తన వ్యాపారానికి లాభంగా వుంటుందని నాయరు ఆ పని చేసాడు.

★ ★ ★

పైడితల్లి వయసు నలభై దాటింది. ఆమె బలంగా ఎత్తుగా వుంటుంది. గుండ్రని మొహం, పెద్ద బొట్టు, ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతుంది. పళ్ల దుకాణం పెట్టకముందు సొంత వ్యవసాయంలో పనిచేస్తూ వుండేది.

'సాలీసాలని భూములట్టుకొని ఎవసాయం సేత్తాగూకుంటే, పెట్టుబడి కూడా తిరిగి రావటం లేదు! మరెందుకా ఎవసాయం?! వొల్లు సిదగ్గొట్టుగోడవే కానీ కాణీ కూడా కనబడ్డం నేదు! ఇటు ఎవసాయం గాక, అటు కూలి పని గాక, సెడిపోతన్నాం! మంచిధరకి భూములు కొందరు కొంతన్నారు! అమ్మేసు గుంటే మంచిది! మరో పని సూసుకోఒచ్చు! ఎప్పుడూ కళ్లతో సూడనంత డబ్బు ఒకేపాలి సేతుల్లో పడద్ది! డబ్బు సేతుల్లో వుంతాది! ఆ పైన ఆ పనో ఈ పనో సేసుకుంటూ బాగా బతకొచ్చు!' అలా కొందరు ప్రచారం చేయించి చిన్న రైతుల భూములు కొనడం ప్రారంభించేరు. ఆ మాటలు నమ్మి చాలామంది భూములు అమ్మేసుకుంటున్నారు. పైడితల్లి భర్త కూడా ఆ పనే చేసాడు. ఆ తరువాత వాళ్ల దగ్గరే కూలీగా చేరిపోయాడు. పైడితల్లి పళ్ల దుకాణం పెట్టి కుటుంబాన్ని ఆదుకుంటోంది.

అటువంటి పైడితల్లి ఈ మద్దిన రోజూ ఓ మాట అందరికీ చెబుతోంది.

'... మా బూవులు ఆల్ల సేతుల్లోకి సెనక్కాయల్లా ఎల్లిపోనాయి .. ఆ బూవుల్లో మా వోల్లే కూలీలుగా పనిసేత్తన్నారు. ఆ బూవులూ మాయే ... ఆ తోట వేసి నోరూ మా వోల్లే .. అయ్యి ఇయ్యాల ఎకరాకి అయిదు నచ్చలు పలుకుతోంది!.. మావ్ దగా కానుకోనేకపోనాం ... ఆల్ల బతుకులు బుగ్గవా, ఆల్లు మా బతుకులు బుగ్గి సేసేసినారు...' అని నెత్తీ నోరూ మొత్తుకుంటూ అందరికీ చెప్పుగుంటోంది.

★ ★ ★

ఈ మద్దిన నాయరు తన వ్యాపారాన్ని పెంచుకోవాలనుకుంటున్నాడు. ఒకరోజున పైడితల్లిని పిల్చేడు. బడ్డీలో ఎత్తుగా కూర్చోబెట్టేడు. చల్లని నిమ్మసోడా ఇచ్చేడు. లంక పొగాకు చుట్ట నోటికి అందించేడు. ఆస్సెం ఆడేడు.

"... అమ్మా! పైడితల్లమ్మా! నువు నాకు సాయం చేయాలి - నిన్ను ఇక్కడ గూకోబెట్టేను ... ఏపారం కిటుకులు సెప్పేను... నమ్మినోళ్ళనే దగా సేయాలని సెప్పేను ... నువు బాగు పడ్డావు ... సంతోషం ... అయితే, నువ్విక్కడ గూకోడం వల్ల నా ఏపారం దెబ్బ తింటోంది ... జాగా సాలటం నేదు ... ఇరుకైపోనాది ... నీకు దండవెడతా! నువు ఖాళీ చేసి దుకాణం మరోసోట ఎట్టుకో... ఖాళీ సేసీ తల్లీ! నీ సేతులట్టుకుంటా! దండవెడతా!" అని నాయరు పైడితల్లిని ఖాళీ చేసి వెళ్లిపొమ్మని చెప్పేడు.

అన్నేయం ... అన్నేయం ... అన్నేయం ... అని పైడితల్లి మనసులో మండిపోతోంది. మేకల పైడితల్లికి నాయరు అలా చెబుతున్నాడే గానీ మనసులో మరోలా అనుకుంటున్నాడు. '... పైడితల్లమ్మా! నా నొవ్వుణ్ని! పోలీసోళ్లకు పోలీసోణ్ని! నిన్ను రేత్తిరికి రేత్తిరి ఖాళీ సేయిచ్చి ఎల్లగొట్టేగల్ను!... అయితే ఆ పనే మంచిగా సేద్దావనుకుంతన్నాను! అంతే!' అని నాయరు ధీమాగా అనుకుంటున్నాడు.

బొజ్జయ్యరు మరోలా అనుకుంటున్నాడు. "ప్రపంచీకరణ ప్రభంజనంలో, వ్యాపార విస్తరణలో, రాజ్యమే ప్రజల బతుకు తెరువులు పడగొట్టేస్తోంది! నేను నాయర్ని, నాయరు పైడితల్లినీ వెళ్లగొట్టకుండా వుంటావా?!.. చీకిటి నుంచి చీకటిలోకి ప్రత్యక్ష వలస పాలన నుంచి పరోక్ష వలసపాలనలోకి వ్యవస్థ నడుస్తోంది... అది నిజమే... అయితే, అది మనవర్గానికి లాభం... ఎవరి లాభాలు ఎవరు వదులుకుంటారు!?... ఏవ్యవస్థలో మనం బాగుపడతామో, ఆ వ్యవస్థనే మనం పెంచి పోషించాలి!?" అని అయ్యరు నిశ్చయించుకున్నాడు.

★ ★ ★

ప్రజలను పీడిస్తున్న దోపిడీవ్యవస్థలు ఎందువల్ల బలపడుతూ కొనసాగుతున్నాయి? ఎందుకంటే ఏ వ్యవస్థలో ఏ వర్గ ప్రజలు బాగుపడుతున్నారో, ఆ వర్గాలు ఆ వ్యవస్థలను పెంచి పోషిస్తాయి కాబట్టి. పీడిత ప్రజలను తిరగబడకుండా రాజ్యం అణిచి ఉంచుతుంది. కాబట్టి.

★ ★ ★

(ఆదివారం ఆంధ్రప్రభ - 02.03.2003)

# ఇవాళ...

విశాఖపట్నం నేషనల్ హైవే రోడ్డు మీద నడుస్తున్నాను. కొత్త రోడ్డు చేరుకున్నాను. సూర్యుడు కోపంగా, ఎర్రగా చూస్తున్నాడు. గాలి వేడిగా వీస్తోంది. వందలాది కూలీలు అక్కడకు చేరుకుంటున్నారు. కొంతసేపు అక్కడ నిలబడ్డాను. పోలీసులు కూలీలను తరుముతున్నారు. ఎందుకో తెలీదు! ఏం జరుగుతుందో తెలీదు! ఏవీ అర్థం కాలేదు! ఏం జరుగుతోందో ఎవరికీ తెలీదు! జోరుగా ముందుకి నడుస్తున్నాను.

సూర్యుడు మండుతున్నాడు. గాలి వేడి వేడిగా వీస్తోంది.

కళ్లు మూసుకుని నడుస్తున్నాను. నోరు మూసుకుని నడుస్తున్నాను. ముక్కు మూసుకుని నడుస్తున్నాను.

రోడ్డుకి రెండువైపులా, అల్లుకున్న ముళ్ల పొదలు... దట్టమైన పొదలు.. వాటి చాటున ఆడవాళ్లు... లేస్తున్నారు... కూర్చుంటున్నారు... కళ్లు మూసుకుని నడుస్తున్నాను... నోరు మూసుకుని నడుస్తున్నాను... ముక్కు మూసుకుని నడుస్తున్నాను... ఆడవాళ్లు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు... ఏం చేస్తారు?!... తప్పు వాళ్ళది కాదు... రోడ్డు మద్దిన నడిస్తే వాహనాల భయం... రోడ్డుకి అటూ ఇటుగా కాలుపెట్టలేం... రోడ్డు మద్దిన మాత్రం ఎత్తుచేసి మొక్కలు నాటుతున్నారు... ఎందుకు?!... ఎవరికోసం?!... ప్రపంచ బ్యాంకు అప్పా?!... ఎవరో ఆ ఆడవాళ్ల మీదకు రాళ్లు రువ్వుతున్నారు!... ఎవరో?!... ఎందుకో?!... కళ్లు మూసుకుంటూ విప్పుతూ, విప్పుతూ మూసుకుంటూ, జోరుగా నడుస్తున్నాను. ఈగలు మూడో నాల్గో నా చెవుల చుట్టూ తిరుగుతూ వెంటాడుతున్నాయి. జోరు ఎక్కువ చేసి, జోరీగలని తరుముతూ, జోరు జోరుగా నడుస్తున్నాను.

కొంత దూరం నడిచేను. కళ్లు పూర్తిగా విప్పి నడుస్తున్నాను. ఆయాసం వస్తోంది. జోరు తగ్గించాను. ఏవేవో కేకలు... అరుపులు... బూతులు... పక్కకు తిరిగి చూశాను.

నీటి కొళాయి... బారులు బారులుగా బిందెలు.... కన్నీటి చుక్కల్లా నీటి చుక్కలు... నానే ముందొచ్చేను... కాదు కాదు నానే ముందొచ్చాను... పిల్లల మీది పెమాణంసేసి సెబుతున్నా... దేవుడి మీది ఒట్టేసి సెబుతున్నా... నా నెత్తిమీది